

# ముగ్గురు మొండివాళ్ళు

అవసరాల
నారాయణరావు

కాంపౌండ్ గేట్ చప్పుడైంది.

కింది అంతస్తులో ముందు-వరండా-పైరొద మేడ మెట్ల దగ్గిర స్తంభానికి కట్టిన అల్సేషియన్ ఖైదు గొలుసును ముందుకీ, వెనక్కీ గుంజిపారేస్తూ మేడంతా ప్రతిధ్వనించేలా అరుస్తూంది.

పైన అంతస్తులో ఉన్న సూర్యకాంతం కిటికీ దగ్గిరికి వచ్చి చూసింది.

గొలుసును తెంపుకుని, మీద ఎక్కడ పడుతుందో అని గుండెల్ని చేత్తో పట్టుకుని కుక్కవైపే చూస్తుంటూ మేడమెట్లెక్కిన కాకీదుస్తుల మనిషి చేతిలో ఉన్న ఉత్తరాల కట్టలోనించి ఓ బరువైన కవరు తీసి గుమ్మంలో నిండుగా నించున్న సూర్యకాంతం చేతిలో పెట్టాడు.

కవరు చించి, ఉత్తరం మడత విప్పింది.

వరంగల్,
5—3—66

"మహాలక్ష్మీ సమానురాలూ, పూజ్యురాలూ అయిన మా అత్తగారికి మీ అల్లుడు రెండు చేతులు జోడించి వవినయంగా నమస్కరించి వ్రాయునది"

మొహం చేటంత చేసుకుంది సూర్యకాంతం.

అల్లుడి వినయ విధేయతలకు మురిసిపోతూ, ఆ వాక్యాన్ని మళ్ళీ ఇంకోసారి చదువుకుంది.

చేటంత మొహమూ ముడుచుకుపోయి చేపకన్నంత అయిపోయింది!

"మా" అత్త...

"మీ" అల్లు...

"రెండు చేతులూ..."

'ఏం వెటకారంగా ఉంది కుర్రాడి పనీ?... అల్లుడు కాదూ మరి. అందుకూ ఆ బ్రతిమిరుగుడు!'

"నిజానికి ఈ ఉత్తరం శ్రీ మామగారి పేర వ్రాయటం ధర్మం..."

'అలాగే అఘోరించలేకపోయావ్! నా పేర ఎవడు వ్రాయమనీ ఏడిశాడూ?'

"కాని... మళ్ళీ అనుకున్నాను, నోరు లేని మనిషి దేవుడితో సమానం అని!"

'ఓహో... ఆయన దేవుడు! నేనే రక్కసి ముండను!...

అను... అనూ... ఇంకా ఎన్ని అనాలో అను.

అల్లుడివి కదూ... ఎన్ని కూతలు కూయటానికైనా నీకు హక్కుంది!...

అది నీ తప్పు కాదులే. ఆడపిల్లలను కన్నవాళ్లది...

'కూతుర్ని ఇచ్చుకున్నాం కదా అనీ, అల్లుడు వెనక ఆడిన ఆటకీ, పాడిన పాటకీ అల్లా మామా, గుమ్మెట, తంబురా ఇద్దరూ చెరొహాటీ చేత్తో పట్టుకుని తందాన తానా అని తాళం వేసి పాట పాడి, అల్లుడనే జాతికి ఆదినుంచీ కొమ్ములు తెచ్చిపెట్టారు. ఆ కొమ్ములే ఇప్పుడు నువ్వూ విసురుతున్నావు. విసురు... విసురు!'

ఉత్తరం చేత్తో పట్టుకుని వెళ్ళి, హాలులో పంకా కింద సోఫాలో చతికిలబడి సావకాశంగా చదవసాగింది.

"కోడల్ని కాపరానికి తీసుకువెళ్ళటానికని మొన్న మా నాన్నగారొస్తే "మా...అ...మ్మా...యి మీ... ఇం...టి...కెం...దు...కొ...స్తుం...దీ?" అని సాగదీసుకున్నార్ట మీరు!

అయితే, మరెవరింటికి వెళుతుందేమిటి? ఒకవేళ ఎవరింటికీ వెళ్ళకపోతే, మీ అమ్మాయిని ఏం చేసుకుందాం అనుకుంటున్నారేమిటీ?

మా మామగారు రాంచి మా నాన్నగారు అడగలేక పోయి దానివి వే ...ంటున్నారు."

'పే... ద్ద మొనగాడవు బయల్దేరావనీ!'

ఏవగింపుతో మూతి మూడు వంకర్లు విరుచుకుంటూ, ఎడమ అరచేతిని ఒకసారి శూన్యంలో— నీటిలో ఈదుతూన్న చేపతోకను తెడ్డులా ఆడించినట్టు — ఆడించింది.

'ఎవరింటికో వెళ్ళి ఉండవలిసిన ఖర్మ దానికేం పట్టిందీ?'

"పెళ్ళయిన ఆడది కట్టుకున్న మొగుడితో కాపరానికి వెళుతుంది లోకంలో.

మరి మీ అమ్మాయి ఆడది కాదో, లేక మీ అమ్మాయిచేత కాపరం చేయించక మరేం చేయించదల్చుకున్నారో మీరు — నాకు తెలీదు."

'ఎంత మాట!... హెంత మాట!...' గుండె రెండుసార్లు బాదుకుంది సూర్యకాంతం. 'ఎదురుగా లేవు! బతికిపోయావు!'

"మీరు ఐశ్వర్యవంతులు! ఉంది కాబట్టే — అందరూ మూడు పూటలే తింటే, మీరు మూడు మూళ్ళ తొమ్మిది పూటలు తింటారు రోజుకి! గంట గంటకూ ఫాలూ, పళ్లరసాలూ ఏమైనా తాగుతారు!

"ఇంత తిని, ఇన్ని తాగిని ఒళ్ళు ఊరుకుంటుంద అని?"

'ఏం పొగరూ?... కలవారి అల్లుడు కావటం

ఇచ్చి పుచ్చుకొనడాలలో, ఎప్పుడూ మనసు పూర్తిగా ఉండడం అవసరం. మినహాయింపులు కూడవు. ధనం, అంతస్తు, ప్రతిష్ఠ లెక్కిస్తే స్వార్థం మనసును ఆక్రమించి కలుషితం చేసివేస్తుంది. సూరేక్క పంటలు కావలసిన జీవితాలు నరక సదృశాలుగా రూపొందుతాయి.

తోనే కళ్ళు నెత్తిమీది కొస్తాయనుకుంటాను...

మా కుందని, అంత తింటాం అని, ఇన్ని తాగుతాం అనీ ఏడుపెందుకు?... నన్నూ వచ్చి తిని ఉండమన్నాంగా.'

"ఒళ్ళు కొవ్వెక్కడా అని కాదు నే ఏడుస్తున్నది. కొవ్వెక్కి, ఒళ్ళు ఊరుకుంటుందా అని."

ఒళ్ళంతా సూదులు గుచ్చుతున్నట్లనిపించింది సూర్యకాంతకి.

"కడుపునిండా తిండీ, కంటినిండా నిద్రా, ఒంటినిండా బట్టా — ఈ మూడేనా గావలిసింది? మా అమ్మాయి కింకేమీ అక్కర్లేదా?...

ఖర్మంచాలక... ఒకవేళ ... ఎప్పుడైనా ... ఏదైనా ... రవలు వచ్చిందనుకోండి! అప్పుడేం చేస్తారు?...

"అల్లరిచేస్తున్నా మీ అమ్మాయి ఒళ్ళును ఊరుకోబెట్టగలరా? ... తరిమివుతుందా ఊరుకోబెట్టడానికి?...

"ఇప్పుడు దొకవేళ మానేస్తే, మీ అమ్మాయి అంత ఉన్నప్పుడు మీరు ఏం చేసేవారో ఓ సారి గుర్తు తెచ్చుకోండి! గుర్తురాకపోతే, మామగారిని అడగండి!"

'ఎంత బరితెగించి పోయాడూ!'

పళ్ళు కొరుక్కుంది సూర్యకాంతం.

"ఒళ్ళి ఒళ్ళో కూర్చుని, పమిట చాటునించి మీ ...యి ఇంకా పల్చని పాలు తాగుతూందనుకుం ...టారేమో, పాపం!...

మీ కాలంలో... ఆ ఈడులో ... మీరు కూడా అలా ఉండి ఉండరు.

కావలిస్తే, ఈ మాట మీ అమ్మాయికి తలంటు పోసినప్పుడు కాస్త పరీక్షగా చూడండి, నా మాట అబద్ధమేమో...

నేను మగాణ్ణి. నాకేం ఫర్వాలేదు. నేనేం చేసినా నన్నడిగేవాడు లేడు. నా కేమీ రాదు...

కాని, మీ అమ్మాయి నాలా మగాడు కదు. రేపు ఏదైనా వస్తే, వీధి కెక్కేది మీరే. 'ఫలానా సూర్యకాంతంగా రమ్మాయి' అని అందరూ మీ పేరే చెప్పుకుంటారు ఘనంగా. ఆ పైన మీ ఇష్టం...

నేను మాత్రం చస్తే మీ కొంపకి కాపరానికి రాను. మామగారి సహనం నాకు లేదు.

ఇట్లు,
—మీ అమ్మాయి మొగుడు!"

'మీ మామగారు కూడా ఇలాగే కబుర్లు చెప్పారు మొదట్లో...

రాక ఏం చేస్తావోయ్?... తోక ఆడించుకుంటూ మరీ వస్తావ్!'

గుడ్లురుముతూ, ముక్కుపుటాలెగరేస్తూ చేతిలో ఉన్న ఉత్తరాన్ని ఉండలా చుట్టి, మేడమీదినించి కిందికి కిటికీలోనించి విసిరికొట్టింది.

సరిగ్గా అదే సమయానికి ఆ కిటికీ కింది నించి వానిటీ బాగ్‌ను చేత్తో పట్టుకుని ఒళ్ళు ఊపుకుంటూ ఒయ్యారంగా నడుముకుంటూ తన గదివైపు వెళుతూన్న రాధ తలకు తగిలింది.

ఉలిక్కిపడి ఆగి, నేలమీద పడిన ఉండ తీసి విప్పి, మొదటి అయిదారు వాక్యాలూ చదివి ఓసారి నవ్వుకుని, మళ్ళీ ఆ ఉత్తరాన్ని మడిచి పదిలంగా తన బాగ్‌లో దాచి పెట్టుకుని, అధుర్దాగా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ తన గదిలోకి వెళ్ళిపోయింది రాధ.

* * *

వెండిని కరిగించి ఆకాశం మీదనించి కిందికి విరజిమ్ముతూన్నట్లు బయట వెన్నెల విరగకాస్తూంది.

గది కిటికీ దగ్గర ఉన్న నైట్ క్వీన్ ఉండి ఉండి గుప్పున సువాసనలను వెదజల్లుతూంది.

ఓ పక్కన ఆ వెన్నెల...ఇంకోపక్కన ఈ సువాసనలు,.. మరొక పక్కన రమణారావుని గురించిన తియ్యని ఊహలు!...

రాధకు ఒంట్లో బాగాలేదు!

ఎవరో, ఎక్కడో గిలిగింతలు పెడుతూన్నట్లు అనిపిస్తూంది. ఇక్కడా అక్కడా అనకుండగా, ఒళ్లంతా పులకింతతో ఏకమైపోయి, ఏదో మత్తు ఆవహించి, తనేదో అయిపోతూంది!

నిలువుటద్దం ముందు నిలుచుని, కట్టువిడిచిన చీర టవెల్ స్టాండ్ మీదికి విసిరికొట్టి, తన ప్రతిబింబాన్ని ఓసారి చూసుకుంది.

దొంగచాటుగా వెనకనుంచి రమణారావు వచ్చి, రెండు చేతులతోటీ తనను అమాంతంగా తీగలా చుట్టేసుకుంటున్నాడు!

మొహంమీద మొహం ఆనించి, నోట్లో నోరు పెట్టి, పువ్వుమీద వాలిన తుమ్మెదలా, ఏమిటోగాని వెర్రిగా జుర్రేసుకుంటున్నాడు!

రమణారావు ఇలా అసభ్యంగా ప్రవర్తిస్తూంటే,

తన ఒంట్లో అనారోగ్యం ఇంకా ఎక్కువై పోయింది!

మిలమిల మెరిసిపోతూన్న తెల్లచీర తీసి మడత విప్పి, చుట్టబెట్టుకుంటూంటే, కుంగుమాతి పెట్టుకుని, రమణారావు చటుక్కున వెనక్కి తిరిగి చక్కా పోయాడు.

ఒళ్ళంతా అలిసిపోయేలా ఓసారి పగలబడి నవ్వుకుంది తను.

వెన్నుకి వెనకవక్కన గామగెద్దు గంతలులాంటివి బిగించి కట్టే, వాటి మీద ముందువుంచి వెనక్కి తెల్ల జాకెట్టును తొడిగింది.

తల ముడిలో సన్నజాజుల దండ తురిమింది.

సన్నజాజులంటే రమణారావు పడి చస్తాడు!

బట్టలకు సంపంగి సెంటు పూసుకుంది.

అది పూసుకుంటే దాని వాసనతోపాటు తననూ పీల్చేస్తాడు!

"పోచీ! . . . ఒసే, పోచీ!" అద్దం ముందు నించుని, రెండు చేతులతోను తల ముడిని సరిచేసుకుంటూ, పిలిచింది రాధ.

"పిలిశారా, సిన్నమ్మగోరూ?" పోచమ్మ వచ్చి రాధకు ఎదురుగా నించుంది.

"పెద్దమ్మగారు పడుకున్నారా?" చీర కుచ్చెళ్ళను సర్దుకుంటూ అడిగింది రాధ.

"ప...డు...కు...న్నా...ర...మ్మా?" పోచమ్మ గొంతు మామూలుగా లేదు. అందులో ఏదో బాధ మెదులుతూంది.

"పెద్దయ్యగారో?" తన ముస్తాబుకి చివరి మెరుగులు దిద్దుకుంటూ అడిగింది.

"ఆరూ పడుకున్నారమ్మా."

"కుక్కని తీసుకెళ్ళి వెనకవక్క కట్టేసి రా."

"కట్టేసొచ్చానమ్మా."

ఆశ్చర్యంతో పోచమ్మ మొహంలోకి ఒక్కసారి రెప్పార్పకుండా చూసింది రాధ.

"ముందువక్క కడితే, మీ రొచ్చిన అలికిడికి అది అరుస్తాది. అది అరిత్తే, అమ్మగారు లేత్తారు. అ పిలప్పుడు మీరు ఆరి కంట పడ్డారంటే అన్నీ ఆరా తీత్తారు. . .

వారం రోజుల్నుంచీ దానిని ఎనక పక్కనే కడతన్నాను గందా, సిన్నమ్మా."

సిన్నమ్మ అర్థంచేసుకుని ఊరుకుంది.

క్షణంపాటు ఇద్దరి మధ్యా నిశ్శబ్దం.

"తలుపులూ అవీ జాగ్రత్త. నాలుగింటికి ఫాక్టరీ కూత వినిపించగానే కాంపౌండు గేటు తాళం తీసేసి ఉంచు. తెలిసిందా." వానిటీ బాగ్‌ను చంకకు తగిలించుకుంది రాధ.

"మీరు సేత్తూన్నది మంచిపని కాదు, సిన్నమ్మగోరూ!"

రాధ అదిరిపడింది.

పోచమ్మ ఆ విధంగా సాహసించటం, తనకు జ్ఞానం వచ్చాక అదే మొదటిసారి.

పోచమ్మ పన్నెండేళ్ల పిల్లగా ఉంటూన్నప్పుడు ఆ ఇంట్లో ప్రవేశించింది. దానికి ముందూ, వెనకా ఎవరూ లేకపోవడం మూలాన తిండీ బట్టా అన్నీ పెట్టి తన ఇంట్లోనే ఉంచేసుకుంది సూర్యకాంతం.

పోచమ్మను పెట్టుకున్నాక, ఇంట్లో ఒక్క పూచిక పుల్ల పోవటం ఎరగదు తను.

పోను పోను ఆ నమ్మకం తనకు తెలీకుండానే అభిమానంగా మారింది.

వయస్సు రాగానే పోచమ్మను ఓ ఇంటిదాన్ని చేసింది ఆ అభిమానమే.

మొగుడూ, పెళ్లాం ఎప్పుడూ ఇంటిని కనిపెట్టుకుని ఉంటారని పెరట్లో రేకులతో ఓ పాక వేయించి ఇచ్చింది.

కష్టం సుఖం, పురుడూ పుణ్యం ఏం వచ్చినా, "అమ్మా! . . . నా కిది కావా"లని అడిగి పెట్టించుకు తినే హక్కును ఆ ఇంట్లో సంపాదించుకోగలిగింది పోచమ్మ.

ఏ లోటూ లేకుండగా వెళ్ళిపోతూంది.

అక్కడ ఉంటూనే నలుగురు పిల్లల తల్లి అయింది.

పోచమ్మ సచ్చగా ఉండటం వాడికి కిట్టలేదు. ఓ రోజున హఠాత్తుగా పోచమ్మ మొగుణ్ణి ఎత్తుకుపోయాడు దేవుడు.

అక్కడ . . . తండ్రిలేని ఆ పిల్లలూ, ఇక్కడ... తనను తల్లిని చేసిన ఈ చల్లని మేడా — ఇవి చూసుకుని బ్రతుకుతూంది పోచమ్మ.



కుటీరం

చిత్రం—వి. రామచంద్రరావు (గుంటూరు-1)

"అయితే, చాలా దూరం వచ్చావే!"

గుడ్లురుముతూ పోచమ్మను ఒకసారి కిందినుంచి పైదాకా చూసింది రాధ.

"మాకే నీతులు చెప్పేటంతటిదానవయ్యా వన్న మాట!"

"మీలాటి సదువుకున్నోరికి నేను నీతులు సెప్పగలనా, సిన్నమ్మా? . . .

"సిన్నప్పటినించి మీ ఉప్పూ, కారం తిని బతికిన దాన్ని. . .

సెడు జరుగుతూంటుంటే సూడలేక సెప్పాను."

"ఏది మంచో, ఏది చెడో మాకు తెలుసు. మవ్వేం చెప్పనక్కర్లేదు." కళ్ళెర్రజేసి చూస్తూ కసిరి కొట్టింది రాధ.

"వయస్సులో ఉన్న ఆడపిల్ల — అందులోను పెళ్ళయినోరు — ఈ పిలప్పుడు ఇలా ముత్తాబై ఇంట్లోంచి దొంగసాటుగా ఎల్లటం మంచిపని అవుతాదా సెప్పండి, సిన్నమ్మా? . . .

ఎవురైనా సూత్తే ఏమనుకుంటారు? అమ్మగోరూ, అయ్యగోరూ నలుగురిలోనూ తలెత్తుకు తిరగ్గలరా? నిప్పులాంటి ఒంశానికి మచ్చ తెత్తారా, సిన్నమ్మా?"

తప్పు చేస్తూన్న దానిలా తల వంచుకు నించుంది రాధ.

"ఈ సంగతి మీ అత్తోరికీ, ఆళ్లకీ తెలిత్తే ఆ బాబు మిమ్మల్ని ఏలుకుంటాడా సెప్పండి, సిన్నమ్మా? నిచ్చేసంలాంటి నూరేళ్ళ కాపరంలో మీ సేతులో మీరే నిప్పులు పోసుకుంటారా సెప్పండి, సిన్నమ్మా?"

ఫక్కున నవ్వేసింది రాధ.

నవ్వేసి, క్షణం ఆలోచించి, వానిటీ బాగ్‌లోనించి ఏవో తీసి పోచమ్మ గుప్పెట్లో కుక్కి, "ఈసారి కిది ఉంచుకో!" అంది, పోచమ్మ మొహంలోకి పరీక్షగా చూస్తూ.

గతుక్కుమంది పోచమ్మ.

"పెద్దోళ్ల నోళ్ళను డబ్బుతో పెద్దోళ్ళు నొక్కేత్తారు. నిజమే, సిన్నమ్మా... నా నోరంటే నొక్కెయ్యగలరుకాని, ఊళ్లోవోళ్ళ అందరి నోళ్ళనూ నొక్కగలరా, సిన్నమ్మా? . . .

మీ దారి కడ్డుతగుల్తున్నానని అనిపిత్తే, మీ రెండు సేతుల్తోటీ నా గొంతు పిసికి సంపెయ్యండి. మిమ్మల్ని కన్నవోరు పెద్దమ్మ గోరేకానీ, ఎత్తుకుని పెంచింది ఈ సేతులు. ఈ సేతులు కోరే బౌహుమతులు ఎండి రూపాయలుకావు, తల్లీ! మా సిన్నమ్మ కడుపున కాసిన ఆ సినబాబు తాలూకు బంగారు సిరులు!"

గచ్చుమీద రాలిన వెండి రూపాయలు గలగలమంటూ చెదిరిపడ్డాయి.

"ఈ ఇంట్లో నువ్వు కేవలం దాసీదానవన్న సంగతి మరిచిపోతున్నావు. నీతో నాకు వాదన అనవసరం. . . వెళ్లి నీ పని చూసుకో."

పోచమ్మ మొహంలోకి కొరకొరా చూస్తూ ముందుకి అడుగు వెయ్యబోయింది రాధ.

"నన్ను సంపి, నా పీనుగు మీదనించి నడిపెల్లండి, సిన్నమ్మా!" గుమ్మాని కడ్డంగా నించుంది పోచమ్మ.

"మా ఎంగిలిచేతులు నాకుతూ మమ్మల్నే కాదనే టంతటిదానవయ్యావు!?" పళ్ళు పటపటకొరుకుతూ, పోచమ్మ మీదికి విసురుగా వెళ్ళి, తీసిపెట్టి ఆ చెంపమీదా, ఈ చెంపమీదా చెళ్ళు చెళ్ళున కొట్టి, కాలితో బలంగా ఒక్క తావు తన్నింది రాధ.

వచ్చుబడిన కళ్లతో గుమ్మాని కవతలప్రక్క నేల మీద నరికిన మానులా పడిపోయింది పోచమ్మ, వెల్లకిలా.

"ఈ గుట్టు ఏమాత్రం బయటికి పొక్కినా నీ పిల్లలు దిక్కులేని వాళ్ళయిపోతారు. జాగ్రత్త" పడిపోయి ఉన్న పోచమ్మ మొహంలోకి నిప్పులు కురిపించే చూపులు చూస్తూ వెళ్ళిపోయింది రాధ.

* * *

వరంగల్,

5—3—67.

"అత్తగారూ,

ఇలా బోడిబోడిగా సంబోధిస్తున్నందుకు కొత్త

ముంచి మీకు కోపం రాదుగదా?

స...రి...గ్గా ఇదే తారీఖున, ఇదే నెలలో — సంవత్సరం మాత్రం ఇప్పటిదానికి ముందు — మీకు నేను ఓ చిన్న ఉత్తరం వ్రాసుకున్నాను.

'మా అత్తగారి దగ్గిరనించి నాకు ఉత్తరం ఏమైనా వచ్చిందా, ఖాశిం?' అని ఈవేళ ప్రొద్దున్న కూడా అడిగాను మా వార్డు పోస్టుమాన్‌ని!

ఈ ఉత్తరంలో ఒక ముఖ్యమైన విషయం వ్రాయదలుచుకున్నాను. నిజానికి, వ్రాయటం ఇష్టంలేదు. కాని, వ్రాయక తప్పటంలేదు. ఏం చెయ్యను?

ఈ మధ్య నేను ఆనోటా ఈనోటా మీ అమ్మాయి ప్రవర్తనని గురించి చాలా చెడ్డగా వింటున్నాను..."

'ఏమిటేమిటీ?' మీద పిడుగు పడ్డట్లయింది సూర్యకాంతానికి! రెట్టింపు వేగంతో కొట్టుకుంటూన్న గుండెలో, కింది పంక్తుల మీదికి దృష్టిని పారించింది.

"రాత్రిపూట ఇంటిపట్టున ఉండటం లేదట. మీరూ, మామగారూ మేడమీద గదిలో లైటార్పుకుని పడుకున్నాక మీ అమ్మాయి ఇంట్లోంచి మెల్లిగా జారుకుంటూందట. రాత్రి అంతా అడ్డమైన తిరుగుళ్ళూ తిరిగి, తెల్లవారు ఝామున ఎప్పుడో ఏ నాలుగు గంటలకో, అయిదు గంటలకో వచ్చి, తన గదిలో ఏమీ తెలీనట్లు పడుకుంటుందట...

'బాల్యే పితుర్వశే తిష్ఠేత్!
పాణిగ్రాహస్య యౌవనే!
పుత్రాణాం భర్తరి ప్రేతే!
న భజేత్ స్త్రీ స్వతంత్రతాం' అని ఊరికే అన్నారా మరి పెద్దలూ?"

'అ...ప్రా...చ్యు...డా!' సూర్యకాంతం ఒళ్ళు సెగలూ, పొగలూ క్రక్కింది! 'కాపరానికి పంపించలేదనే కక్షకొద్దీ కట్టుకున్న పెళ్ళాం మీద ఇలాంటి ఘోరమైన అభాండాలు వేసేటంతటి నైచ్యానికి దిగజారిపోయావా? ... నిప్పులాంటి పిల్లమీద ఇలాంటి తప్పుడు కూతలు కూయటానికి నీకు నోరెలా వచ్చిందీ? నువ్వు తింటూన్నది అన్నమేనా?' కుతకుత ఉడికిపోయింది సూర్యకాంతం.

"మీ అమ్మాయి దుర్నడతకు బాధ్యులెవరు? ...

నేనుమాత్రం కాను. కోడల్ని కాపరానికి తీసుకువెళతాం, పంపించమని సలక్షణంగా వచ్చి అడిగారు మా నాన్నగారు. కాలుమీద కాలు వేసుకుని కూర్చుని, మొహం పక్కకు తిప్పుకుని, "మా అ...మ్మా...యి మీ...ఇం...టి...కెం...దు...కొ...స్తుం...దీ?" అని మూతి మూడు వందల వంకర్లు తిప్పుకుంటూ సాగదీసుకున్నాడట, ఆ కోడల్ని కన్నావిడే, మహాతల్లి!

పిల్ల నిచ్చుకున్న తల్లికే అంత తలబిరుసుతనం అయితే, మరి పిల్లను చేసుకున్నవాడికి ఎంతుండాలి? అన్న పంతంకొద్దీ ఆ అల్లుడుగాడు అప్పటినించీ అత్తింటి మొహం చూడటం మానేశాడు. న్యాయం కూడా అంతే కదా మరి!

ఇహ పోతే మీ అమ్మాయి ఎంతవరకూ బాధ్యురాలా అని?

నిజానికి ఈ విషయం ప్రస్తావించటం నా కనవసరమే. కట్టుకున్న వాణ్ణే నాకు కాకుండా పోయినప్పుడు, మీ అమ్మాయి ఎలా పోతే నాకేం కావాలి? ఏమై పోతే నాకేం కావాలి?...

కాని, కాస్త కూస్త చదువుకున్న వాళ్ళంకాబట్టీ, భగవంతుడు అంతో ఇంతో ఇంగితజ్ఞానం ఇచ్చాడు కాబట్టీ, ఏ పరిస్థితుల్లో ఎవరు ఎంత వరకూ బాధ్యులో బేరీజు వెయ్యటం ఒక చెడ్డ అలవాటయిపోయింది! అందుచేత తప్పటం లేదు...

పన్నెండో ఏటకే మీకు పెళ్ళయిపోవటం, పెళ్ళయిన ఏడాదికే మీ ఇంట్లో మార్పు రావటం, ఆ మార్పు వచ్చిన ఏడాదికే మామగారు మీ గదికి తరలి రావటం — ఇలా ఒక ఏడాది వెళ్ళి ఇంకో ఏడాది తిరక్కుండానే అన్ని మార్పులూ ఒకదానిమీద ఒకటి గొలుసుకట్టుగా వచ్చేశాయి కనక మీకు సుఖమే కాని, కష్టం తెలీదు!...

కాని, మీ అమ్మాయి విషయంలో అలా కాదు కదా మరి.

ఏపుగా పెరిగి, ఎప్పుడో మార్పు వచ్చిన ఒంటిని ఎనిమిదేళ్ళు ఎలాగో ఓపికపట్టి కాసింది! ఇంకా ఎన్నాళ్ళని కాస్తుంది మరి, పాపం! ఓరిమికైనా తరుగుంటుందంటారా?

కన్న తల్లి చూస్తే కష్టం సుఖం అడక్కపోయె. కట్టుకున్న మొగుడు చూస్తే ససేమిరా అని మొండికేసుకుని కూర్చునె.

> పాప ప్రక్షాళనలకు దానం ఉపకరించినంత శక్తివంతంగా మానవుల ముందు నమ్రత ఉపయోగిస్తుంది.
>
> —డి. హోఫెడ్

చస్తుందేమిటి మరి!

అందుచేత బాధ్యతంతా నలుచదరంగా మీ భుజాలమీదే పడుతుంది.

చివరిసారిగా మీకు చెప్పవచ్చే ముక్క ఏమిటంటే, ఒకసారి చెడిపోయిన ఆడదాన్ని మళ్ళీ పెళ్ళాంగా చేరదీసే చవట దద్దమ్మ ఈ భూమిమీద ఇంకా పుట్టలేదు, పుట్టబోడు!

చట్టరీత్యా ఏ 'ఆకులు' ఇవ్వాలో ఇచ్చేసేసి, నా దారిని నేను చక్కదిద్దుకో దలిచాను.

మరి, నేను మాత్రం ఎన్నాళ్ళని ఓపికపడతాను, చెప్పండి? ఆకార్యంలో ఎరిగిన ఎరగటమే మీ అమ్మాయిని. అంతే, మళ్ళీ నోచుకోలేదు కదా మీ పుణ్య మాలని.

ఇట్లు,

—మీ అమ్మాయికి కాకుండా పోతూన్న మొగుడు!'

'ఈ సూర్యకాంతం చెవలపిల్లి కాదు, నీ తాటాకు చప్పుళ్ళకు బెదిరిపోవటానికి. హ్హా!' చేతిలో ఉన్న ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చించి పారేసింది.

"పె...ద్ద...మ్మ...గా...రూ!"...

ఫాను గాలి కెగురుతూన్న ఉత్తరం ముక్కలవైపే రెప్పార్పకుండా చూస్తూ సోఫాలో కూర్చున్న సూర్యకాంతం తలఎత్తి చూసింది.

పోచమ్మ మొహం బరువుగా ఉంది.

"సి...సి... సిన్నమ్మగోరికి..."

మాటలు తడబడ్డాయి పోచమ్మకు.

"ఏమిటైందే సిన్నమ్మగారికి?" అదుర్దాగా అడిగింది సూర్యకాంతం.

"వాంతులవుతున్నాయమ్మా!"

"వాంతులా? ... ఎప్పటినించి?"

"ఏమోనమ్మా! ఇప్పుడే సూశాను."

"డాక్టరుగారికి ఫోనుచేసి వెంటనే రమ్మని చెప్పు." సోఫాలోంచి లేచి, కాళ్ళ ముందున్న హవాయ్ చెప్పుల్లోకి పాదాలను దోపింది.

"ఈ వాంతులికి డాకటేరు గారు ఏం సేత్తా రమ్మా?"

తల వంచుకుని, నేలచూపులు చూస్తూ అంది పోచమ్మ.

నడినెత్తిమీద సుత్తితో ఎవరో ఓ పెట్టు పెట్టినట్లనిపించింది సూర్యకాంతానికి!

"ఏమిటే నువ్వంటున్నది?" అంటూ ఉరిమింది, పోచమ్మ చెప్పబోయేది తను భయపడుతూన్నది కాకూడదని మనసులోనే దేవుడికి మొక్కుకుంటూ.

"అ...వు...న...మ్మా!...సి...న్న...మ్మ...గో...రి...కి నా...లు...గో...నె...ల...ట!"

ఓ పట్టాన గొంతు పెగిలిరాలేదు పోచమ్మకు.

"ఆఁ!" ఎలా తెరుచుకున్న నోరు అలాగే ఉండిపోయింది! విప్పిన కనురెప్పలు వాలకుండా నిలిచిపోయాయి.

ఆశ్చర్య భయాందోళనలతో స్తంభీభూతురాలైన సూర్యకాంతం ఒకటి రెండు క్షణాల తరవాత తేరుకుంది.

'ఇంటా వంటా లేవు. ఇలాంటి బుద్ధులొచ్చాయేమిటే దీనికి? ...ఆ మొండి శిఖండిగాడు మొహం చూపించి అప్పుడే సంవత్సరం అయింది. ఇప్పుడు నాల్గో నెలంటే ... ఎంత అప్రతిష్ఠ! ... ఎంత అప్రతిష్ఠ! ... నలుగురిలోనూ తలెత్తుకు తిరగ్గలమా?"

పోచమ్మను వెంటబెట్టుకుని గబగబా మేడమెట్లు దిగింది.

రాధ గది తలుపు దబదబా బాదింది.

గడియ తీసి వెళ్ళి, పరుపుమీద బోర్లా పడుకుని, దిండులో తల దూర్చి, వెక్కివెక్కి ఏడుస్తూంది రాధ.

"రా...ధా!" మంచంమీద పక్కనే కూర్చుంటూన్న తల్లి గొంతు కరుకుగా ధ్వనించింది.

"అ...మ్మా!" తల్లి ఒడిలో తల పెట్టుకుని, ఒక్కసారిగా బావురుమంది రాధ. "నన్ను మన్నించమ్మా. నాకు అతీతమైన శక్తేదో నన్ను అలా ఈడ్చుకుపోయింది. సహృదయంతో నన్ను అర్థంచేసుకుని మన్నించలేవా, అమ్మా. తన ప్రేవుల్లోంచి పుట్టుకొచ్చిన బిడ్డను కన్న తల్లే మన్నించకపోతే ఈ భూమిమీద ఇంకెవరు మన్నిస్తారమ్మా?" ఏకధారగా కురుస్తూన్న కన్నీటితో రాధ ముక్కూ మొహం ఏకమైపోయాయి.

మాతృహృదయం ఆర్ద్రమైంది.

'మీరు ఐశ్వర్యవంతులు. ఉన్నది కాబట్టి అందరూ మూడు పూటలే తింటే, మీరు మూడు మూళ్ళు తొమ్మిది పూటలు తింటారు రోజుకి. గంట గంటకీ పాలూ, పళ్ళరసాలూ ఎన్నయినా తాగుతారు...

ఇంత తిని, ఇన్ని తాగిన ఒళ్ళు ఊరుకుంటుందా అని! ఒళ్ళు కొవ్వెక్కదా అని కాదు నే నడుగుతున్నది. కొవ్వెక్కిన ఒళ్ళు ఊరుకుంటుందా అని? . . .

'కడుపునిండా తిండీ, కంటినిండా నిద్రా, ఒంటి నిండా బట్టా — ఈ మూడేనా కావలసింది? ... మీ అమ్మాయి కింకేమీ అక్కర్లేదా? ...

ఖర్మంచాలక ... ఒకవేళ ... ఎప్పుడైనా ... ఏదైనా కావలసి వస్తుందనుకోండి. అప్పుడేంచేస్తారు?.

అల్లరిచేస్తున్న మీ అమ్మాయి ఒళ్ళను ఊరుకో బెట్టగలరా? మీ తరమవుతుందా ఊరుకోబెట్టటానికి?

తల్లి ఒళ్ళో కూర్చుని, పమిట చాటునించి మీ అమ్మాయి ఇంకా పట్టని పాలు తాగుతూందను కుంటున్నారేమో, పాపం! ...

ఏపుగా పెరిగి, ఎప్పుడో మార్పు వచ్చిన ఒంటిని ఎవిమిదేళ్ళ ఎలాగో ఓపికపట్టి కాసింది. ఇంకా ఎన్నా ళ్ళని కాస్తుంది మరి, పాపం! ఓరిమికైనా తరుగుంటుం దంటారా? ...

కన్న తల్లి చూస్తే కష్టం, సుఖం అడక్కపోయె. కట్టుకున్న మొగుడు చూస్తే సన్యాసిరా అని బొండి కేసుకుని కూర్చున్నాడు! ఏమ్తుందేమిటి మరి?

అందుచేత, దీనికి బాధ్యతంతా పిల్లనిచ్చిన మీ భుజాలమీదే పడుతుంది.'

మెలికల్లా మెదిలి, వాళ్ళ హృదయాన్ని కలవర పెట్టాయి.

"మన్నించవలసింది నిన్ను కాదమ్మా, రాధా, నన్ను!"

తల్లి స్వరంలోని మార్దవం కూతురి మనస్సుకి మంచి లేపనం పట్టుల్లా అనిపించింది.

ఎండా వానా ఒకేసారి వచ్చిన వాతావరణంలా, కన్నీళ్ళు కారుతూన్న రాధ మొహం దరహాసంతో విప్పారింది.

"లే! ... ఓర మార్చుకో! ... కోఠీస్ ఎగ్జిబిషన్ మొదటి వెళదాం."

"ఇప్పు దెందుకమ్మా? ... నా ఒంట్లో తేడాగానే ఉంటూంది."

"అందుకు కాదమ్మా!... ప్రాణాపాయం లేకుండా..." అర్థోక్తిలోనే ఆపేసింది సూర్యకాంతం.

"అ ... మ్మా!" భయాందోళనలతో కంపించి పోతూ, ఒక పిచ్చికేక పెట్టింది రాధ. "అంతమాట అనకమ్మా!" ప్రాణ భయంతో తెల్లబోయింది రాధ మొహం.

"చేసిన పాపం చాలక, శిశుహత్యాపాపం కూడా కట్టుకోమంటావా, అమ్మా?" వ్యథతో రాధ గొంతు బరువుగా ధ్వనించింది.

"తండ్రి ఎవరైనా, తల్లిని నేనే. ప్రపంచంలో ఏ తల్లీ తన బిడ్డను చంపుకోదు. నా ప్రేవుల్లో పుట్టి పెరుగుతూన్న ప్రాణిని నేను చంపలేనమ్మా!" వేదనతో విలవిల్లాడిపోయింది రాధ.

"రా ... ధా!" సూర్యకాంతం స్వరం కఠినంగా ధ్వనించింది. "తప్పని పరిస్థితుల్లో పాపం, పుణ్యం అంటూ కూర్చోవటం తగదు.

ఈ సంగతి పలుగురి నోట్లోనూ పడి మీ అత్త వారి దాకా పాకిపోతే, నీ జీవితం ఏమైపోతుందో ఆలోచించుకో!...

పదిమందిలోనూ ఓ హోదా అనుభవించుకుంటూన్న కుటుంబాన్ని రచ్చకెక్కించకు. వంశ గౌరవానికి మాయని మచ్చ తెచ్చిపెట్టకు!"

సూర్యకాంతం గొంతు, పోనుపోను మరింత కఠినంగా ధ్వనించసాగింది.


"ప్రపంచం అంతా ఏకమై నా మీద కత్తికట్టినా సరే, నే నీ పనికి ఒప్పుకోను ..."

"మనిషై పుట్టాక తప్పులు అందరూ చేస్తారు."

"నా అపరాధాన్ని మన్నించగలిగే హృదయం ఒక వేళ వారి దగ్గిర లేకపోతే, నా దారి నేను చూసు కుంటాను.

"నా వల్ల నువ్వు తల ఎత్తుకు తిరగలేనంటే, నీకు దూరంగా — ఈ ప్రపంచం విడిచి అంచులకు— పోతాను. నా పాపిష్ఠి మొహం నీకు మళ్ళీ జన్మలో చూపించను...

అంతో ఇంతో తెలుసుకొని ఇప్పుడే చెప్పేయ్యమ్మా! నీ నిర్ణయం నా గుండెల్ని చీల్చేదయినా నేను భరిస్తాను... చెప్పమ్మా! ... చెప్పు!!"



"... నియమం ప్రధానం"

చిత్రం — కె. ఎస్. రెడ్డి (హైదరాబాద్)

తల్లి భుజాలను పట్టుకుని, ఆవేశంతో కుదిపింది రాధ.

దిక్కు తోచలేదు సూర్యకాంతానికి.

"అతను నాన్నా అలా మొండిపెనుకుని కూర్చు న్నాడు. నువ్వు చూస్తే ఇలా. ఎవ రెలా పోయినా, మీ నాన్నగారి కేమీ అక్కర్లేదు. అందరూ కలిసి నా ప్రాణాలు తీయండి." రెండు చేతులతోనూ తల పట్టు కుని, బరువుగా అడుగులు వేసుకుంటూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది సూర్యకాంతం.

* * *

హైదరాబాద్,
7—3—67.

"చిరంజీవి అల్లుణ్ణి అత్తగారు సూర్యకాంతం పుత్రపౌత్రాభివృద్ధిగా దీవించి వ్రాయునది.

నువ్వు వ్రాసిన రెండు ఉత్తరాలూ అందాయి, అల్లుడూ.

వయస్సులో చిన్నవాడవైనా, నీ కున్న లోకజ్ఞానం, దూరపు చూపు నాకు లేవు. ఇందుకు నిజంగా నిన్ను అభినందిస్తున్నా నల్లుడూ.

నువ్వు వ్రాసినవన్నీ అక్షరాలా నిజం, ఒక్కటి తప్పించి.

నువ్వు వ్రాసిన ఉత్తరంలో అమ్మాయి ప్రవర్తన గురించి చాలా ఘోరమైన అభాండాలు వేశావు. ఇది నీకు న్యాయమేనా, అల్లుడూ? నీలాంటి సహృదయుడూ, చదువుకున్నవాడూ, వివేకవంతుడూ చెయ్య వలసిన పనేనా ఇది, చెప్పూ? రాధ నీకు ఏడాదిపాటు పెళ్ళామే. కాని, నాకు ఇరవై రెండేళ్ళ నుంచి కూతు రది. ఎవ రెక్కువ ఎరుగుదురంటావు?

సీతమ్మవారులాంటి దది! అది అరికాలు పెట్టి పెట్టగానే, నిప్పు మన్నూ చల్లారిపోయి ఊరుకుంటుంది! ఈ సంగతి నీకుమాత్రం తెలియదేమిటి! ఇలా చావుకి పెడితేనే గాని లంఖణాలకు రాదు అత్తగారిని ఎత్తి వేశావు. సుస్తేం తక్కువవాడివా, నాయనా!

చూడు, అల్లుడూ! రాధ నాకు లేకలేక పుట్టిన ఒక్కగా నొక్క కూతురు. దానిమీ దుండే మమకారం కొద్దీ, దాన్ని విడిచి ఉండలేక, పూజ్యులైన శ్రీ మా నాన్న గారు దానిని తీసుకు వెళ్ళటానికి వచ్చినప్పుడుగాని, ఆరి పిలవాలని అనలేకపోయాను. కాని, మొన్న నీ దగ్గిర నించి వచ్చిన ఉత్తరం చూశాక, 'నాదంటూ ఒక ఆడది ఉండీ కూడా నాకు అనుభవించేంత సుఖం లేకపోయె' నని అని, పాపం, నువ్వు ఎంత బాధపడుతున్నావో ఉద్యోగం లేదంది. నా కడుపు తరుక్కుపోయిందంటే నమ్ము.

ఇన్నేళ్ళ సంసారం, ఎంతో సౌఖ్యాన్ని ఉన్న మొగుడూ, పెళ్ళాలను దూరంగా ఉంచేశాను. పాపిష్ఠిదాన్ని. నీ ధర్మమా అని నా కళ్ళు కిప్పుడు తెలివి వచ్చింది. నీలాంటి మంచి అల్లుడుగా లభించటం నిజంగా నా అదృష్టం.

ఈ ఉత్తరం అందిన వెంటనే స్వయంగా వచ్చి అమ్మాయిని తీసుకువెళ్ళు, అల్లుడూ.

ఇలా చెప్పి, అలా వెళ్ళిపోతానంటే వప్పుకోను సుమా! కనీసం ఓ వారం పదిరోజు లుండి మరీ వెళ్ళాలి. మీ ఇద్దరూ ముచ్చటగా చిలకా గోరింకల్లా నా కళ్ళ ముందు మసులుతూంటే చూడాలని ఇదిగా ఉంది.

ఇప్పుడు అప్రస్తుతం అయినా, ముఖ్యమైన విషయం ఒకటి ప్రస్తావించదలుచుకున్నాను.

అడేమిటంటావేమో?

మీ మామగారి సంగతి నీకు తెలుసు. ఏది ఎక్క డుందో, దేనిమీద ఎంత వస్తుందో ఆయనకు ఏమీ తెలీదు. అన్నింటికీ ఆడముండను నేను చావాల్సిందే.

నేను గుటుక్కుమంటే చాలని కొన్ని పక్కలు కాచుకుని కూర్చున్నాయి.

అలాంటి అవాంతరమే ఏదైనా అయితే — అయితే ఏమిటి? ఉట్టికట్టుకుని ఊగుతానేమిటి లేకపోతే? — మా చేతికి చిల్లిగవ్వ దక్కదు.

వెలుతురుండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలన్నారు నీలాంటి విజ్ఞులు.

కాబట్టి, అంతా నీ కప్పగించి నేను విశ్రాంతిగా ఉండదలిచాను. అవసరం అయితే, ఇంకో వారం పై

ఉచితం! ఉచితం! ఉచితం!

తెల్లమచ్చలు

ప్రసిద్ధికెక్కిన మా బజ్‌రంగ్ సీసామందు అన్ని రకముల తెల్ల మచ్చలను, ఎరుపు రంగును కూడ 5 దినములలో మార్చును. చర్మము బహు శీఘ్రముగ సహజ రంగును పొందును. ప్రచారమునకు గాను ఒక సీసా మందు ఉచితముగ ఇవ్వబడును. వెంటనే వ్రాయండి.

GAYA AYURVEDASHRAM (SW)
P.O. Katri Sarai (Gaya)

వాయిదాల మీద ట్రాన్సిస్టర్



ప్రపంచ ప్రసిద్ధమైన నేషనల్ డీలక్స్ 3 బాండ్స్ అఖిల ప్రపంచ పోర్టబుల్ ట్రాన్సిస్టర్, రు. 285/- ఖరీదయినది నెలసరి రు. 10/-ల వాయిదాల మీద పొందండి. ప్రతిపల్లెకు, బస్తీకి పంపవచ్చును. వ్రాయండి.

IMPEX INDIA (WAP)
P. B. 1045, Delhi-6.

తెల్ల వెంట్రుకలుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కాని మా 'కేశరంజన్' ఆయుర్వేదిక్ పెంటెడ్ ఆయిల్ తెల్లవెంట్రుకలను నల్లగామార్చును. మొదట తెల్లవానిని నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి కంటిచూపును వృద్ధిపరచును. లాభంపొందిన వారు 1000 పైగా మాకువ్రాసియున్నారు. లాభంలేకున్న డబ్బువాపసు. ధర రు. 10/-.

Bharat Treatment Centre (B)
P.O. Katri Sarai (Gaya)

ఏజంట్లు కావలెను

ఆర్టు సిల్కు చీరెలు, టెరిలిన్ షర్టు మరియు పాంటు ముక్కలు, స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలు వగైరాలకు ఆర్డర్లు సేకరించుటకు నెలకు రు. 500/-ల మీద లేక ఆకర్షణీయమైన కమిషను మీద ఇండియా అంతటా ఏజంట్లు కావలెను. ఉచిత షరతులకు, పూర్తి నిడివి శాంపిలుకు వ్రాయండి:

ARVIND AGENCIES (APW-44),
P. O. Box 1408, Delhi-6.

రోజులు ఎక్కువ ఆగవలసి వస్తుందేమో. అందుకు సిద్ధమై మరీ రా!

నీ రాకకోసం నేనూ అమ్మాయీ ఎదురుచూస్తూ ఉంటాం.

శ్రీ మీ నాన్నగారికి మా సవినయ నమస్కారాలు చెప్పు.

ఇట్లు,
నీ శ్రేయోభిలాషిణి,
— అత్తగారు సూర్యకాంతం."

* * *

"రా, అల్లుడూ! ... రా! ఇప్పుడే అనుకుంటున్నాను నీ మాట ... నాన్నగారూ వాళ్ళూ అంతా కులాసాగా ఉన్నారా, బాబూ?"

గుమ్మంలో అడుగుపెడుతూన్న అల్లుణ్ణి చూడగానే సాదరంగా ఆహ్వానించింది సూర్యకాంతం.

"చాలా కాలానికి మీ గడప తొక్కే అదృష్టం లభించింది!"

చిరునవ్వు నవ్వుతూ సోఫాలో కూర్చున్నా డతను.

అల్లుడి ఎత్తిపొడుపుకి ఒకసారి లోలోపలే గతుక్కుమని, "అదృష్టాని కేం ఉం దల్లుడూ? ... ఇదంతా నీది కాకపోతే కదూ?" అనీ, "అమ్మా, రాధా! ... చూడు, అతను వచ్చాడు. టిఫినూ కాఫీ పట్టుకురా, అమ్మా!" అంటూ ఎదురుగా ఉన్న సోఫాలో కూర్చుంటూ ఒక కేక పెట్టింది.

పమిట నిండుగా కప్పుకుని, వల్లమాలిన సిగ్గు అభినయిస్తూ, వెండిప్లేటు నిండా ఫలహారం పెట్టి పట్టుకువచ్చి సోఫాకి ముందున్న టీపాయ్ మీద పెట్టింది రాధ. పెడుతూ మొగుడి వంక క్రీగంట చూసింది, నీరెండలాంటి నవ్వు నవ్వుతూ.

అతడూ చూపుల్ని కలిపాడు, అలాంటి నవ్వే నవ్వుతూ.

మూగ కళ్ళతో వాళ్ళిద్దరూ అలా ముచ్చటించుకోవటం గమనిస్తూనే ఉంది సూర్యకాంతం. కాని, చూసీచూడనట్లు నటించింది.

"అల్లుడుగా రెప్పుడొచ్చారేమిటమ్మా?" ఆశ్చర్యపోతూ హాలులోకి అడుగు పెడుతూన్న పోచమ్మను చూసి మొహం చిట్లించుకుంది సూర్యకాంతం.

"ఇప్పుడే వచ్చాడు. కానీ ... ముందు నువ్వెళ్ళి టామీకి అన్నం అదీ పెట్టి, పక్కలూ అవీ వేసి నీ పని చూసుకో. అప్పుడే ఎనిమిది కావస్తూంది."

ఆ సమయంలో పోచమ్మ అక్కడ ఉండటం ఆమెకు ఎందుకోగాని ఇష్టం లేదు.

'అమ్మగోరేటి ఈ ఏల ఇలా కసిరి కొడతన్నారు?' గొణుక్కుంటూ మేడమెట్లు దిగి వెళ్ళిపోయింది పోచమ్మ.

ప్లేటులో ఉన్న వేయించిన జీడిపప్పు ఒక్కొక్క పలుకుమా తీసి నోట్లో విసురుకుంటూ నములుతున్నా డతను.

మంచినీళ్ళగ్లాసూ, కాఫీ కప్పూ ఉన్న ట్రే పట్టుకు వస్తూంది రాధ.

ఓరచూపుతో చూశా డామెను.

కళ్ళలో కొత్త కాంతులు.

చెక్కిళ్ళలో వింతైన శోభలు.

ఆమె మొహం అంతకుముందు తను ఎరగని ఏవో కొత్త ఆకర్షణలతో ప్రకాశించిపోతూంది!

ముందుసారి క్రీగంట చూసినప్పుడు తనకు అనిపించిన వివే.

కాని, ఈ మాటు దూరాన్నించి చూసినప్పుడు మరో కొత్తేదో తన కంటి కానింది.

కిందినుంచి పైకి నఖశిఖపర్యంతం పరీక్షగా చూడటం మొదలుపెట్టా డామెను.

అతని కళ్ళు స...రి...గ్గా సగం దూరం వచ్చేసరికి అమాంతంగా నిల్చిపోయాయి!

జీడిపప్పుకు పనిచెబుతూ ఆడుతూన్న అతడి దవడలు క్రమక్రమంగా ఆగిపోవటం మొదలుపెట్టాయి. అతని చూపుల్లో తీవ్రతేదో వచ్చి పడుతూంది.

అల్లుడి వైఖరిలో మార్పును ఓ కంట కనిపెడుతూన్న సూర్యకాంతం ఊపిరితిత్తుల నిండా ఓసారి గాలి పీల్చుకుని, దీర్ఘంగా నిట్టూర్చి, ఎత్తు వేయబోయే చదరంగపు ఆటగాడిలా ఊహిస్తూ కూర్చుంది!

కాజా ఉన్న సాసర్ని కొంచెం పక్కకి జరిపి, చేతిలో ఉన్న ట్రేను టీపాయ్ మీద పెట్టి, అతడి కళ్ళలోకి చూస్తూ, ఓ చిన్న సార్థ్యపు నవ్వు నవ్వింది రాధ. నవ్వి ఇటు తిరిగింది.

ఇంకా ఇటు పూర్తిగా తిరిగిందో లేదో, భళ్ళున చప్పుడు!

వెండిప్లేటు గోడకు కొట్టుకుని వంకరపోయింది!

కప్పూ, సాసరూ, గాజుగ్లాసూ ముక్కముక్కలై గలగల రాలాయి.

అదిరిపడి వెనక్కి తిరిగి చూసింది రాధ.

బుసలుకొడుతూ తోక మీద లేచిన తాచులా నించుని, ఆవేశంతో ఊగిపోతున్నా డతను.

మొహం కందగడ్డలా ఉంది.

కళ్ళు చింతనిప్పుల్లా ఉన్నాయి.

"మాయమాటలు చెప్పి మీ అమ్మాయి ఆడుతూన్న ఆటలన్నింటికీ నన్ను అడ్డం పెట్టుకోవాలని చూస్తున్నారా?"

హాలంతా ప్రతిధ్వనించింది అతగాడి అరుపుకి.

భయకంపితురాలైంది రాధ.

"అభిమానమున్నవా డెవ్వడూ అవినీతికి పాల్పడిన ఆడదాన్ని మళ్ళీ పెళ్ళాంగా దగ్గిరికి చస్తే రానీయలేడు ...

"ఆ నోటా ఈ నోటా విన్నవి కిట్టనివాళ్ళు చేసిన దుష్ప్రచారమేమో అనుకున్నాను. కాని, వాటిలోని యథార్థాన్ని ఇప్పుడు కళ్ళారా చూశాను." ఉరిమా డతను.

నోట్లో పమిటకొంగు కుక్కుకుని, కంట తడి పెట్టుకుని, కుమిలిపోతూ అక్కణ్ణించి వెళ్ళిపోయింది రాధ.

"వేలిమీద పుండు లేచిందని కాలిని నరికేసుకుంటామా, అల్లుడూ? ... ఆ పుండుకు తగిన చికిత్సను ఆలోచిస్తాం. ఆ బాధకు నివారణోపాయాన్ని వెతుకుతాం. అంతేకానీ ..."

ఆమె ఇంకా ఏదో చెప్పబోతూండగానే, అడ్డు తగిలా డతను. "అయితే ఈ పుండుకి తగిన చికిత్స మీరు ముందే సిద్ధంచేసుకుని ఉంచుకున్నారన్నమాట!" కనుబొమలు ముడివెట్టి, రెప్పార్పకుండా కొరకొరా చూశాడు అత్తగారి కళ్ళలోకి.



ముంగాళపై జంట

చిత్రం—కె. త్యాగరాజన్ (తిరుపతి)

"మనిషన్న తరువాత జీవితంలో తప్పులు చెయ్యటం సహజం, అల్లుడూ ...

"ఆ చేసిన తప్పునూ, ఆ తప్పుకు వెనక ప్రేరణ అయిన పరిస్థితులనూ సానుభూతితో అర్థంచేసుకుని క్షమించగల ఔదార్యాన్ని మనం పెంపొందించుకోవాలి. అదే మానవత్వం అనిపించుకుంటుంది."

"ఓ ...హో!" వెటకారం ధోరణిలో కనుబొమ లెగరేసి, తలను అదోమాదిరిగా వంకించా డతను. "మా అమ్మాయి ఎన్ని వెధవపనులయినా చేస్తుంది, ఎన్ని అడ్డమైన తిరుగుళ్లయినా తిరుగుతుందీ, నువ్వు మాత్రం నోరు మూసుకుని పడిఉండు!" అంటారు — ఇది కాదూ మీ బోధ తాత్పర్యం?" ఓరకంటితో చూశాడు.

"రాధ నా కూతురే కాదు, ఇప్పుడు నీ భార్య కూడాను!" క్షణం ఆగింది సూర్యకాంతం. "ఖర్మం చాలక, పెళ్లయిన ఆడది కాలు జారితే అది పదిమంది నోట్లోనూ పడితే, తమ్మాలంగా వచ్చే అప్రతిష్ఠ కేవలం పుట్టింటికే వచ్చి ఊరుకోదు. ఆ అప్రతిష్ఠలో కొంత పాలు అత్తిల్లు కూడా విధిగా పంచుకోవలసి వస్తుంది. 'ఫలానా వారి కోడలు. ఫలానా వాడి పెళ్లాంరా ఇదీ' అని చెప్పుకుంటారు...

"రాధ చేసిన తప్పు నా కెంత తలవంపో, నీకూ అంతే. నిజానికి నా కంటే నీకే ఎక్కువ!...

నేను ఆడదాన్ని. ఎప్పుడూ ఇంటిపట్టునే ఉండే దాన్ని. కాని, నువ్వు మగాడివి. వీధిలో తిరిగేవాడివి. పదిమందిలోను తలఎత్తుకు తిరగగలగాలి...

నువ్వూ ఇలా రెండడుగులు ముందుకు వేసి వెళ్ల గానే, నీ వెనకాలే 'ఛీ! ... ఛీ ... పుట్టింట ఒంటరిగా కాపరంచేస్తూ ఓ పచ్చని దబ్బపండును కన్నది చూడు! ... ఆ పతివ్రతా శిరోమణి మొగుడు!' అంటారు...

ఈ 'కాంప్లిమెంట్'లు నువ్వు జీర్ణంచేసుకోగలవా?"

విల్లును ఎక్కుపెట్టి, నారిని చెవులదాకా లాగి విడిచిపెట్టిన బాణంలా, అత్తగారి సవాలు అల్లుడి గుండెల్లోకి సరాసరి దూసుకుపోయింది.

గతుక్కుమన్నా డతను.

"కంచె చేనుకూ, కోటకు గోడ ఎలాగో సంసారానికి గుట్టూ అలా! ఒంటి మీద బట్ట లేకుండా తిరగటం ఎంత లజ్జాకరమో, సంసారానికి గుట్టూమట్టూ లేకుండగా చేసుకోవటం - అంత అవమానకరం...

ఇలాంటి తప్పే ఓ పెళ్లయిన మగాడు చేస్తే, ఆ తప్పుసు మరో ఆడది ఏదో మాటల సందర్భంలో అతగాడి భార్య దృష్టికి ఒకవేళ తెస్తే; ఆ భార్య ఏమంటుందో తెలుసా? ...

'ఛ! ... ఛ! ... అబ్బే, ఆయన అలాంటి వారు కారు. ఎవరో కిట్టని వెధవలు ఆయన మీద ఉన్న అసూయకొద్దీ అలా దుష్ప్రచారం చేసి ఉంటారు' అని అడ్డంగా ఖండించి పారేస్తుంది. 'మా ఆయన శ్రీరామ చంద్రుణ్ణే చంపిపుట్టారు! ఏమనుకున్నావో!' అని నిలువునా మొగుణ్ణి సమర్థిస్తుంది. అంతేకాని, అత గాణ్ణి వీథిన పారేసి, తను వీథికెక్కదు. 'నువ్వు మైల పడిపోయావు, నా కక్కర్లేదు,' అని మొగుణ్ణి వదిలేసి పుట్టింటికి పారిపోదు. ఇంటికి వచ్చాక మందలిస్తుంది. మంచి మాటలతో మొగుణ్ణి మార్చటానికి ప్రయత్నిస్తుంది...

దాంపత్యజీవితం అంటే ఒక పెద్ద రాజీ, అల్లుడూ!"

అత్తగారి వాక్చాతుర్యానికి అతడు చకితుడయ్యాడు.

"ఇంతకీ మీరు చెప్పవచ్చే ముక్కేమిటి?" మొహం ముడుచుకుంటూ అన్నాడు.

"రాధ కడుపులోని పాప నిన్ను 'నాన్నా' అని పిలుస్తూ, నీ కళ్ల ముందు మసులుతూంటే నువ్వు భరించలేవు ఆ రంపపుకోత, నాకు తెలుసు ...

నీ గుండెలకు శల్యంలా ఉండే ఆ పాపను నా దగ్గరే ఉంచుకుని, నేనే పెంచుకుంటాను. తండ్రి ఎవరైనా, నా కూతురి కడుపున పుట్టిన బిడ్డ నా కడుపున పుట్టిన బిడ్డతో సమానం ...

రాధనూ, నన్నూ క్షమించు...

సరేనా!"

తిత్తులనిండా ఊపిరిని నింపుకుని, దీర్ఘంగా నిట్టూర్చాడు.

ఆ రాత్రి ... కూతురికీ, అల్లుడికీ మేడమీద తన పక్క గదిలోనే పక్కలు వేయించింది సూర్యకాంతం.

పది గంటల వేళప్పుడు పక్క గది తలుపులు లోపలి నించి భళ్లున మూసుకున్నాయి.

మూసుకున్న మరుక్షణంలోనే గదికి పైనున్న వెంటిలేటర్లోంచి రెండు గొంతులు కలిసి పగలబడి నవ్వటం వినిపించింది ఇవతలి గదిలోకి.

ఆ నవ్వుల్లోని అసలు రహస్యం తెలిసి సూర్యకాంతం అంతా తన గడుసుతనమేనని తలుచుకుని తలుచుకుని మురిసిపోయింది!

★